

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.0 । కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (సోమవారం సాయంత్రం) సహర్: 4:54 (మంగళవారం ఉదయం)



వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం అప్పారెడ్డిపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట



ఖిల్లాఘణపురం మండలం సల్కెలాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై విరిగిపడ్డ చెట్టు



భూత్పూర్ మండలం కర్వెన శివారులో పడిన వడగండ్లు



వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపి కన్నీరు మున్నీరవుతున్న కౌలు రైతు గోనెల శేషయ్య

కడగండ్లు

మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో వడగళ్ల వాన

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట
- నేల రాలిన మామిడి కాయలు
- భూత్పూర్‌లో విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- మహబూబ్‌నగర్ మండలంలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం
- నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందని వెల్లడి
- బొక్కలోనిపల్లిలో బాధితులతో మాట్లాడిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- 1,980 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందన్న వ్యవసాయ అధికారి



వర్షానికి భూత్పూర్‌లో బ్రిడ్జి వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

అకాల వర్షం రైతును కోలుకోలేని దెబ్బతీసింది. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వడగళ్ల వాన కడగళ్లను మిగిల్చింది. వరి పంట దెబ్బతినడంతో పాటు మామిడి కాయలు నేల రాలాయి. కూరగాయల తోటలకు నష్టం వాటిల్లింది. అసలే మండే ఎండలతో పంటలకు నీరు సరిపోక అతికష్టం మీద పంటను కాపాడుకుంటూ వస్తున్న రైతులకు వడగళ్ల వాన మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. వానకు వడ్లు నేల రాలగా, పొట్ట దశలో ఉన్న పంట మళ్లీ చేతికి వస్తుందా? అన్న సందేహం నెలకొంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 1980 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. వనపర్తి జిల్లాలోని కొత్తకోట, వనపర్తి, ఖిల్లాఘణపురం మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

– మహబూబ్‌నగర్ /పాలమూరు /హన్వాడ/మూసాపేట/వనపర్తి రూరల్/కొత్తకోట/ఖిల్లాఘణపురం

మహబూబ్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతును కోలుకోలేని దెబ్బతీసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వడగళ్ల వాన కడగళ్లను మిగిల్చింది. జిల్లాలోని హన్వాడ, మూసాపేట, మహబూబ్‌నగర్ మండలాల్లో ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అసలే మండే ఎండలతో పంటలకు నీరు సరిపోక అతికష్టం మీద పంటను కాపాడుకుంటూ వస్తున్న రైతులకు వడగళ్ల వాన మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. వానకు వడ్లు నేల రాలగా, పొట్ట దశలో ఉన్న పంట మళ్లీ చేతికి వస్తుందా? అన్న సందేహం నెలకొంది. వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఆదివారం రాజాపూర్ మండలంలో వడగళ్ల వాన కురిసింది. కానీ తక్కువ మోతాదులో పడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ, శనివారం రాత్రి హన్వాడ మండలంలోని నాయినోనిపల్లి, ఇబ్రహీం బాద్, బుద్దారం, కొనగట్టుపల్లి, సల్లోనిపల్లి గ్రామాల్లో వడగళ్ల వాన నష్టం తెచ్చిపెట్టింది. ఆయా గ్రామాల్లో వంద కరాలకుపైగా పంట నష్టం వాటిల్లింది. అందులో 1010 రకం వరి సాగు చేసిన రైతులకు ఎక్కువ నష్టం కలుగగా, ఆర్ఎన్ఆర్ రకం గింజలు తక్కువ రాలాయి. మామిడి రైతులకూ నష్టం తప్పడం లేదు. ఈదురు గాలులతో మామిడి కాయలు చాలావరకు రాలిపోయాయి. వానతో మామిడి కాయలకు పురుగు బెడద రానుంది. కాయలు పట్టేదశలో వడగళ్లు పడితే పండ్లు అయిన తరువాత అందులో పురుగులు పడతాయి. హన్వాడ మండలంలో 20-30 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మూసాపేట మండలంలోని వేముల, చక్రాపూర్, దాసరిపల్లి గ్రామాల్లో వడగళ్ల వానకు 150 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మహబూబ్‌నగర్ మండలంలో ఐదు గ్రామాల్లో కురిసిన వడగళ్ల వానకు 1,525 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మండలంలో పదుల ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. బొక్కలోనిపల్లిలో 300 ఎకరాలు, రాంచంద్రాపూర్‌లో 850, చౌదర్‌పల్లిలో 150, జమిస్తాపూర్‌లో 120, ధర్మాపూర్‌లో 100 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లింది. మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ బొక్కలోనిపల్లి గ్రామంలో పర్యటించి, పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. రైతులు బోరున విలపించారు. మాజీ మంత్రి వారిని ఓదార్చి, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని చెప్పారు.

వ్యవసాయ అధికారుల కాకిలెక్కలు

వడగళ్ల వానకు వేల ఎకరాల్లో

(మిగతా 7లో..)

కాంగ్రెస్ పనైపోయింది

- వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ

7

ఆస్తిపన్ను వసూలులో రికార్డు

- రాష్ట్రస్థాయిలో వడ్డేపల్లి, అయిజ మునిసిపాలిటీలకు 4,5 ర్యాంకులు
- 50 శాతం దాటని గద్వాల, 72 శాతంతో అలంపూర్
- మార్చి 31 నాటికి వందశాతం వసూలుకు ప్రణాళికలు
- మొండి బకాయిల వసూలులో రాజీ పడని అధికారులు

అయిజలో పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది



6

రోడ్డు ట్యాక్స్ చెల్లించకుంటే ఫైన్

- రవాణా వాహనాలపై 200 శాతం అపరాధ రుసుము
- ఈనెల చివరి వరకు స్పెషల్ డ్రైవ్
- ఫిట్‌నెస్, పర్మిట్, పొల్యూషన్, బీమా లేకుంటే జరిమానా
- జిల్లా వ్యాప్తంగా పన్నులు చెల్లించని వాహనాలు 6,042

6

కేఎల్ఐ కాలువలో యువకుడి శవం లభ్యం

7

కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

- మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామ శివారులో ఘటన

నెల రోజులైనా.. దొరకని ఆచూకీ

- శిథిలాల తొలగింపునకు మరో రెండు వారాలు పట్టొచ్చని అంచనా
- టీబీఎం కూరుకుపోయిన 40 మీటర్ల వరకు డేంజర్ జోన్‌గా గుర్తింపు
- తవ్వకాలు నిలిపివేత, ఇనుప కంచె ఏర్పాటు
- ఆ ఏడుగురి ఆచూకీపై ఆశలు లేనట్లే?



డీ1 ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

దోమలపెంట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో(ఎస్ఎల్‌బీసీ) ప్రమాద ఘటన జరిగి ఆదివారానికి నెల రోజులు అవుతున్నా శిథిలాల కింద చిక్కుకున్న 7 మంది కార్మికుల ఆచూకీ నేటికీ లభించలేదు. ఫిబ్రవరి నెల 22న ప్రమాదం జరిగిన నాటి నుంచి నేటి వరకు సహాయ బృందాలు నిర్విరామంగా శ్రమిస్తున్నాయి. సొరంగ ప్రమాదంలో 8 మంది చిక్కుకోగా టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మిగతా ఏడుగురి ఆచూకి కోసం అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానంతో రెస్క్యూ బృందాలు పనిచేస్తున్నాయి. దీంతో వారినీ బయటకు తేచ్చే అవకాశం ఎంత మాత్రం కనిపించడం లేదనేది రెస్క్యూ బృందాలు అధికారులకు నివేదిస్తున్నట్లు సమాచారం.

శిథిలాల తొలగింపునకు రెండు వారాలపైనే..

సొరంగంలో కూలిన మట్టి, రాళ్లు, టీబీఎం మిషన్ విడిభాగాలను పూర్తిగా తొలగించేందుకు రెస్క్యూ బృందాలు నిర్విరామంగా పనిచేసినా మరో రెండు వారాలకుపైగానే పటొచ్చన్ని సహాయ చర్యల్లో పాల్గొనే అధికారులు పేర్కొంటున్నారు. కన్వేయర్ బెల్ట్ జంక్షన్ నుంచి డీ1, డీ2 వరకు 150 మీటర్ల దూరం శిథిలాలు ఉండగా మూడు రోజుల నుంచి 4 ఎక్స్‌కవేటర్లు, మరో డాబ్ క్యాట్ మిషన్‌తో 20 మీటర్ల వరకు శిథిలాలు, ఇనుప పైపులు, గడ్డర్లను లోకో ట్రైన్, కన్వేయర్ బెల్ట్‌పై బయటకు తరలించారు. మిగతా 130 మీటర్లల్లో పేరుకుపోయిన శిథిలాలతో పాటు టీబీఎం విడిభాగాలను పూర్తిగా తొలగించేందుకు మరో రెండు వారాలకుపైగా పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

డేంజర్ జోన్‌గా గర్తింపు

సొరంగంలో 14వ కిలోమీటర్ దగ్గర శిథిలాల కింద కూరుకుపోయిన టీబీఎం మిషన్ ఉన్న ప్రాంతం 40 మీటర్ల దూరాన్ని రెస్క్యూ అధికారులు డేంజర్ జోన్‌గా గుర్తించారు. అక్కడ ఎటువంటి పనులు చేపట్టిన మరో ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లు అవుతుందని అక్కడికి ఎవరూ వెళ్లకుండా ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఇక ఆ ఏడగురు టీబీఎం మిషన్ మునిగి ఉన్న ప్రాంతంలోనే ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రమాదం జరిగి నెల రోజులైనా సొరంగంలో చిక్కున్న వారి ఆచూకీ

(మిగతా 6లో..)

బడి బాగెప్పుడో..?

- అసంపూర్తిగా మిగిలిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు
- మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- చేసిన పనులకు బిల్లులు రాక లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

నాగర్‌కర్నూల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కలగానే మారుతోంది. తాగునీరు, టాయిలెట్లు, ప్రహరీ, విద్యుత్ సౌకర్యం లాంటి అంశాలు కొలిక్కి రావడం లేదు. దీంతో సర్కార్ విద్యను ప్రోత్సహించే లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రాధాన్యతల్లో తేడాలు ఉండడంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతోంది. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండా ఆదరాబాదరగా టెండర్లు పిలిచి 'మన ఊరు-మన బడి' పనులను అట్టహాసంగా ప్రారంభించింది. అప్పటి విద్యాశాఖ మంత్రి ఈ పథకానికి నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం మేడిపూర్‌లో శ్రీకారం చుట్టారు. 'మన ఊరు-మన బడి' పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో తాగు నీరు, విద్యుత్ సౌకర్యం, ప్రహరీ, మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలనేది ప్రధాన ఉద్దేశం. టాయిలెట్లు, కిచెన్‌షెడ్లు, ప్రహరీ నిర్మాణం ఎస్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టాలని నిర్ణయించారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని మూడేళ్ల క్రితం ఈ పథకం ప్రారంభమైనప్పుడు అప్పటి ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

బిల్లులు పెండింగ్



గద్వాల: దౌదర్‌పల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన మూత్రశాలల పనులు



అర్ధాంతరంగా నిలిచిన అమ్రాబాద్ జడ్పీహెచ్ఎస్ నిర్మాణ పనులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మన ఊరు మన బడిలో చేసిన పనులకు కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతు పనులు, తాగునీటి సదుపాయం కల్పించడానికి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి బిల్లులు రాక సంబంధిత కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 816 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 290 పాఠశాలలు 'మన ఊరు-మన బడి' కింద ఎంపికయ్యాయి. వాటి మరమ్మతుకు రూ.89కోట్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు కేవలం 105 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 169 పాఠశాలల్లో పనుల పురోగతి మందకొడిగా కొనసాగుతుండగా 16 పాఠశాలల్లో పనులే ప్రారంభించలేదు. పనులు పూర్తి చేసిన వారికి రూ.18కోట్ల 32లక్షలు కాంట్రాక్టర్లకు చెల్లించగా రూ.10 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు అసంపూర్తిగా వదిలేసినా ఇప్పటి వరకు ఎలాంటి మానిటరింగ్ లేదు. వనపర్తి జిల్లాలో 518 పాఠశాలలు ఉండగా 183 పాఠశాలల్లో 'మన ఊరు-మన బడి' కింద పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందు కోసం దాదాపు రూ.80 కోట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు కేవలం 96చోట్ల పనులు పూర్తి చేశారు. 87 పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

నివేదికలు తెప్పించాం



జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులకు సంబంధించిన వేదిక తెప్పించాం. పనులు ఏ స్థాయిలో కొనసాగాయి, ఎంత మేరకు పూర్తయ్యాయనే అంశంపై పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తున్నాం. గతంలో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు అమ్మ ఆదర్శ పథకం కింద చెల్లింపులు జరుగుతాయి.

– రమేశ్‌కుమార్, డీఈవో, నాగర్‌కర్నూల్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

– ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



బాడుగదిన్నె గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

కోడేరు/కొల్లాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని బాడుగదిన్నె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీసీరోడ్లు, డ్రైనేజీల కోసం పది నుంచి 20 లక్షల వరకు కేటాయిస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య, రైతులకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ కాలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అర్హులందరికీ రుణమాఫీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా కొల్లాపూర్ పట్టణం, మండలంలోని మృతుల కుటుంబాలను పరామర్శించి మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలులో రికార్డు



అయిజ మునిసిపల్ కార్యాలయం

- ● రాష్ట్రస్థాయిలో వడ్డేపల్లి, అయిజ మునిసిపాలిటీలకు 4, 5 ర్యాంకులు
- ● 50 శాతం దాటని గద్వాల, 72 శాతంతో అలంపూర్
- ● మార్చి 31 నాటికి వందశాతం వసూలుకు ప్రణాళికలు
- ● మొండి బకాయిల వసూలులో రాజీ పడని అధికారులు

అయిజ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలులో వడ్డేపల్లి, అయిజ మునిసిపాలిటీలు రికార్డు సృష్టించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 139 మునిసిపాలిటీల్లో శని వారం నాటికి రాష్ట్రస్థాయిలో వడ్డేపల్లి మునిసి పాలిటీ 4వ ర్యాంకు, అయిజ మునిసిపాలిటీ 5వ ర్యాంకు సాధించాయి. వడ్డేపల్లి మునిసిపాలిటీ ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల వసూలు డిమాండ్ రూ.98 లక్షలు ఉండగా అందులో శని వారం నాటికి 84.06 శాతం వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచింది. అయిజ ఈ ఏడాది రూ.1.69 కోట్లు ఉండగా అందులో 84.02 శాతం వసూలు చేసి రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల మునిసిపాలిటీ లక్ష్యం రూ. 7.28 కోట్లు ఉండగా శనివారం నాటికి 46.84 శాతం వసూలు అయ్యాయి. అలంపూర్ మునిసిపాలిటీలో మొత్తం ఏడాది పన్నుల వసూలు డిమాండ్ రూ.48 లక్షలు కాగా శని వారం నాటికి 72.92 శాతం మాత్రమే వసూల య్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం మరో వారం రోజులే ఉండటంతో జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో 100 శాతం పన్నుల వసూలు లక్ష్యంగా ప్రణాళికతో సిబ్బంది పనిచేస్తున్నారు.

పూర్తిస్థాయిలో వసూలు చేస్తాం..



వడ్డేపల్లిలో పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

అయిజ మునిసిపాలిటీలో మొత్తం 8,051 ఇళ్లు ఉన్నాయి. శనివారం నాటికి 84.02 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచాం. ఇంకా 1400 వరకు గృహాలు ఉన్నాయి. వారి నుంచి కూడా నెల చివరినాటికి పూర్తిస్థాయిలో వసూలు చేస్తాం.

- సైదులు, కమిషనర్, అయిజ మునిసిపాలిటీ

31 నాటికి వందశాతం వసూలు చేస్తాం..

మార్చి 31 నాటికి మా మునిసిపాలిటీలో వందశాతం పన్నులు వసూలు చేస్తాం. శని వారం నాటికి 84.06 శాతం వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించాం. రాష్ట్ర స్థాయిలో 80 శాతం పన్ను వసూలు చేసిన మునిసి పాలిటీలు మొత్తం 8 ఉండగా రెండు మాత్రం 100 శాతం, మూడోది 90.35 శాతం వసూలు చేశాయి. 4, 5వ స్థానంలో వడ్డేపల్లి, అయిజ మునిసిపాలిటీలు ఉన్నాయి.

- రాజయ్య, కమిషనర్, మునిసిపాలిటీ, వడ్డేపల్లి



రెస్క్యూ అధికారులతో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్



టన్నెల్‌లోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన కంచె

నెల రోజులైనా దొరకని ఆచూకీ

(5వ పేజీ తరువాయి)

కనుక్కునేందుకు సహాయక చర్యల పనితీరుపై ఆదివారం నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ దగ్గర అధికారులతో సమీక్షా నిర్వహించారు. సహాయక చర్యల్లో పాల్గొనే వారికి అందుతున్న వసతులు, వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక పనుల్లో ఎటు వంటి అవంతరాలు ఎదురు కాకుండా సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్, రైల్వే రెస్క్యూ టీం, అన్వి రోబోటిక్, జేపీ కంపనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నేడు ఉన్నత స్థాయి సమీక్ష

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం జరిగి నెల రోజులు గడిచిన నేపథ్యంలో, సహాయక చర్యల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా కలెక్టర్, ఎస్పీ, ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌లకు చెందిన ముఖ్యులు సమావేశానికి హాజరు కానున్నారు. సీఎంకు వాస్తవ పరిస్థితిని వెల్లడించనున్నారు. నెల రోజుల్లో సహాయక చర్యల పురోగతి, మున్ముందు రెస్క్యూ ఆపరేషన్‌కు సమకూర్చాల్సిన అంశాలపై చర్చించనున్నారు.

గుండుమాల్ గుట్టల్లో పులి సంచారం

● భయాందోళనలో గ్రామస్థులు

కోస్గి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గుండుమాల్ శివారు ప్రాంతంలో ఆదివారం పులి సంచరించినట్లు గ్రామస్థులు తెలిపారు. గుండుమాల్ - కొమ్మూర్ మార్గంలో ఉన్న వేంకటేశ్వరస్వామి కొండ వెనకాల ఉన్న నాగసోళ్ల బాలకిష్టారెడ్డి పొలం వద్ద గుట్టపై పులి బయటికి వస్తున్నట్లు రైతులు గమనించినట్లు తెలిపారు. గుట్ట కింద కొట్టంలోనే పశువులు ఉన్న రైతులు ఇళ్లకు తరలించారు. అటవీ అధికారులు స్పందించి పులి బారి నుంచి తమ పశువులను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సీఎం వ్యాఖ్యలు విచారకరం

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్

గద్వాల సర్కిల్, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న డీఏ, పీఆర్సీ తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు విచారకరమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్ పేర్కొన్నా రు. గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్న త పాఠశాలలో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడా రు. సీఎం మాటలు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల్లో కలవరం సృష్టిస్తున్నాయని తెలిపారు. మూడేళ్లకు పైగా పీఆర్సీని అమలుచేయకపోవడం ప్రభుత్వనిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు కుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి వెంకటరమణ, నాయకులు బీసన్న, తిలక్, ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి ప్రసాద్ గౌడ్

కృష్ణానదిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కృష్ణ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి కృష్ణానదిలో పడి మృతి చెందిన ఘటన నారాయణ పేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం సాయంత్రం కృష్ణ రైల్వే బ్రిడ్జిపై నుంచి దూకుంటాడని, లేదంటే మద్యం మత్తులో పడి మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నరసింహ్మమూర్తి



మాట్లాడుతున్న నరసింహ్మమూర్తి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి, 23(ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామాన శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భోజన పల్లి నరసింహ్మ మూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గల గణేష్ భవన్‌లో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ముందుగా భరతమాత చిత్రపటం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలకు దుర్గావాహిని ఆధ్వర్యంలో ఏప్రిల్, మే నెలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. మండల స్థాయిలో పనిచేసే కార్యకర్తలు సమాజంలో ఎలా ఉండాలో నేర్పించనున్నట్లు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది పండుగ నుంచి హనుమాన్ జయంతి వరకు రామోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందులో భాగంగా ప్రతీ గ్రామంలో ఆలయాన్ని కేంద్రంగా చేసుకుని రాముల వారి ఫొటో పెట్టి పూజలు నిర్వహించాలన్నారు. ప్రతీ చోట కమిటీలు ఏర్పాటు చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజును నియమించారు. గతంలో ప్రధాన కార్యదర్శిగా పని చేసిన నలిగేశి లక్ష్మీనారాయణను విభాగ్ సహకార్యదర్శిగా ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు చాపల హనుమంతు, విశ్వేశ్వరుడు, మఠం దాక్షాయిని, డీకే ఆంజనేయులు, రఘునాథ్‌రెడ్డి, రాజేంద్రమణి, బుట్ట శ్రీనివాసులు, గౌలి సురేష్ బాబు, విగ్నేష్, వంశీ, రామకృష్ణ, సంపత్ పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలలు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన ముస్లిం నాయకులు

గద్వాల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో రెండు మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలను మంజూరు చేయించాలని ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కోరారు. ఆదివారం రాత్రి గద్వాల పట్టణంలోని రామ్‌నగర్‌లోని మసీదులో ఏర్పాటు చేసిన ఇఫార్ విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మైనార్టీల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో 2025-26 విద్యా సంవత్సరంలోనే రెండు మైనార్టీ పాఠశాలలు ప్రారంభమయ్యేలా చూడాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అతిక్‌ఉర్ రెహమాన్, మునిసిపల్ మాజీ వైఎస్ చైర్మన్ ఎండీ బాబర్, రెహతుల్లా, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

రేపు సిర్సనగండ్ల ఆలయంలో వేలం పాట

- ఆలయ చైర్మన్ దేరం రామశర్మ

చారకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని సిర్సనగండ్ల పంచాయతీలోని అయోధ్యనగర్ (గుట్ట)పై కొలువుదీరిన సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఈవో స్వర్గం అంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పలు, తలనీలాలకు ఈనెల 25న స్వామి వారి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2గంటలకు దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు కొబ్బరి కాయలకు రూ. 5 లక్షలు, తల నీలాలకు రూ. లక్ష, కొబ్బరి చిప్పలకు రూ. 50 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. పాట పూర్తి కాగానే 75 శాతం డబ్బులు చెల్లించి, మిగతా డబ్బులు రెండు రోజుల్లో చెల్లించాలని అన్నారు.

మైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- మాజీ ఎంపీ రాములు



భోజనం చేస్తున్న మాజీ ఎంపీ రాములు

వంగూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని పోల్కంపల్లి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం మాజీ ఎంపీ పోతుగంటి రాములు తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆయన సూచించారు. అనంతరం భోజనం చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

రోడ్ ట్యాక్స్ చెల్లించకుంటే ఫైన్

- రవాణ వాహనాలపై 200 శాతం అపరాధ రుసుము
- ఈనెల చివరి వరకు స్పెషల్ డ్రైవ్

వనపర్తి క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ రోడ్ ట్యాక్స్ వసూలుపై జిల్లా రవాణాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. వాహనదారులు సొంతంగా రోడ్ ట్యాక్స్ చెల్లిస్తే సరే.. లేదంటే అంతే సంగతులు. రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం ఫైన్ విధించనున్నారు. జిల్లాలో వేల సంఖ్యలో రవాణా వాహనాలు ఏళ్ల తరబడి ట్యాక్స్ చెల్లించకుండా తప్పించుకు తిప్పుతున్నట్లు గుర్తించారు. బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌కు సిద్ధమైంది. అంతేకాదు ఆయా వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ లైసెన్స్ వంటివి లేకున్నా జరిమానా తప్పదు.

జిల్లా వ్యాప్తంగా ట్యాక్సీ చెల్లించని వాహనాలు

జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన ట్యాక్స్ చెల్లించని వాహనాలు 6,042 ఉన్నాయి. ఇందులో స్కూల్ బస్సులు 82, హార్వెస్టర్స్ 302, లారీలు 529, గూడ్స్ క్యారేజీ 1,285 , ట్రావెలింగ్ వాహనాలు 114, ట్యాక్స్ ప్లేట్ మోటర్ క్యాబ్స్ 65, ట్రాక్టర్, ట్రాలీ (కమర్షియల్ యూజ్) 2,599, ట్రాక్టర్ లోడర్స్ 145 ఉన్నాయి. ఈ వాహనాలకు గత కొంతకాలంగా యజమానులు రోడ్ ట్యాక్స్ చెల్లించడం లేదు. జిల్లాలో రవాణా వాహనాలకు సంబంధించి రోడ్ ట్యాక్స్ రూ.7 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దాదాపు 10 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఈనెల చివరి వరకు స్పెషల్ డ్రైవ్



వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి రోడ్డు ట్యాక్స్ ఇతర పన్నులు వెంటనే చెల్లించాలి. ఈ నెల చివరి వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. స్పెషల్‌డ్రైవ్‌లో పట్టుబడితే 200 శాతం జరిమానాతో వసూలు చేస్తాం.

- మానస, జిల్లా రవాణా శాఖ అధికారి

'నిర్మాణరంగ కార్మికుల పథకాలకు నిధులు పెంచాలి'

ఆత్మకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు పేర్కొన్నారు. టీయూసీఐ దాని అనుబంధ కార్మిక సంఘాల రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని మోట్లంపల్లిలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు తక్షణమే సంక్షేమ పథకాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకుని రెండు మూడు సంవత్సరాలు గడిచినా.. ఇంత వరకు కార్మికులకు డబ్బులు అందలేదని వాపోయారు. అలాగే కొన్ని సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలకు 15 సంవత్సరాల కిందట నిర్ణయించిన స్కీంలను వర్తింపజేస్తున్నారని, అది సరైంది కాదని తెలిపారు. ప్రమాద మరణానికి ఆరు లక్షలు, సహజ మరణానికి ఐదు లక్షలు, మ్యారేజీ, మెటర్నిటి బెనిఫిట్లకు ఇచ్చే స్కీములను రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్మాణ రంగ కార్మికులకు 60 సంవత్సరాలు దాటితే ప్రతీ నెల 5 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలలో చర్చించి వాటి పరిష్కారంపై భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. మహాసభకు జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాసులు, పేతురు, రాములు, నాగేష్, చెన్నకేశవులు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్‌గౌడ్

కల్వకుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తిలో మంగళవారం నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్‌గౌడ్ కోరారు. కల్వకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించే జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆదివారం కల్వకుర్తిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తిలో మంగళవారం నిర్వహించే జాబ్‌మేళాలో 50కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, వాటిలో 5వేలకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సత్వరమే పార్టీ కమిటీలను పూర్తి చేయాలి

- బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ దయానంద్‌రావు



నాగర్‌కర్నూల్ పట్టణంలో నినాదాలు చేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాయకులంతా సమన్వయంతో పని చేసి సత్వరమే పార్టీ గ్రామ, మండల, జిల్లా కమిటీలను పూర్తి చేయాలని బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ దాగిళ్ల దయానంద్‌రావు నాయకులను ఆదేశించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై పార్టీ కమిటీల రూపకల్పనపై దిశా నిర్దేశం చేశారు. ఏప్రిల్ మొదటి వారంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ కమిటీలను పర్యవేక్షించడానికి జాతీయ సమన్వయకర్త, ఎంపీ రాంజీ గౌతమ్ రాష్ట్రానికి రానున్నారని తెలి పారు. జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో మాన్యవర్ కాన్సీరాం, అంబేడ్కర్, జ్యోతిబాపూలే జయంతులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జీ పృథ్వీరాజ్, నాయకులు హర్ష ముదిరాజ్, మీసాల రమేష్, ధర్మేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం టీపొడి వాడితే చర్యలు

- జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్‌కుమార్



నాగర్‌కర్నూల్‌లో టీ నాణ్యతను పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీ స్టాల్స్‌లో నాసిరకమైన టీ పొడిని వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు సూపర్ మార్కెట్లు, టీ స్టాల్స్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని సూపర్ మార్కెట్లలో ప్యాకింగ్ సరకుల వినియోగ గడువు తేదీలతో పాటు వాటి నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా పలు టీ స్టాల్స్‌ను తనిఖీ చేసి వినియోగిస్తున్న టీ పొడి నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కొన్ని సూపర్ మార్కెట్లలో కాలం చెల్లిన వస్తువులను విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. నాసికరమైన వస్తువులను వాడితే ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. టీ స్టాల్స్‌లో వాడే గ్లాసులు, వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రంగా కడిగి వినియోగించాలని ఆయన సూచించారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బ్రాహ్మణులు

కందనూలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం నియోజకవర్గ బ్రాహ్మణులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు, పట్టణంలోని పేద బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, నాగర్‌కర్నూల్ పట్టణంలో బ్రాహ్మణ సంఘం భవనానికి స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. దీంతోపాటు పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉద్యోగం, విద్యా అవకాశాల కోసం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేసేలా తహసీల్దార్‌కు ఆదేశాలు ఇవ్వాలని వినతిలో కోరినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సానుకూలంగా స్పందించి నట్లు వారు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బ్రాహ్మణ సంఘం నాయకులు దుర్గి శ్రీకాంత్, నర్వ దిలీప్‌కుమార్, వెల్దండ ప్రదీప్‌కుమార్, వినోదాచార్యులు, సంతోష్‌శర్మ, పవన్‌కుమార్‌శర్మ, రఘునాథ్‌రావు, రాంప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కడగండ్లు

(5వ పేజీ తరువాయి)

పంటనష్టం వాటిల్లితే వ్యవసాయ అధికారులు మాత్రం వందల ఎకరాల్లో మాత్రమే నష్టం చూపుతున్నారు. ఆదివారం కావడంతో చాలామంది అధికారులు ఇళ్లవద్దే ఉండి నష్టం అంచనా వేశారు. మహబూబ్‌నగర్ మండల అధికారులు పంట పొలాలను పరిశీలించగా, హన్వాడ మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే నాయకులు ఇచ్చిన నివేదికను సమర్పించే ప్రయత్నం చేశారు. ఇది రైతులకు అన్యాయం చేస్తుందని విమర్శలు వస్తున్నాయి. మూసాపేట మండలంలోనూ మధ్యాహ్నం తరువాత అధికారులు గ్రామాలను సందర్శించారు. పంటనష్టం వాటిల్లి, రైతులు ఆవేదనలో ఉన్న సమయంలో వ్యవసాయ అధికారులు పరిశీలనకు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టం అంచనా వేసి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రాథమిక అంచనాలు కాకుండా అన్ని గ్రామాలలో పర్యటించాలని అంటున్నారు. మహబూబ్‌నగర్ వ్యవసాయ అధికారి శృతి మాట్లాడుతూ పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

● ఖిల్లాఘణపురం, (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, అకాల వర్షం కురిసింది. మండల కేంద్ర శివారు ప్రాంతంలో కౌలు రైతులు గోనెల నాగేష్ రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని వేసిన మొక్కజొన్న పంట మరో 15 రోజుల్లో చేతికి వస్తుందని అనుకున్న తరుణంలో అకాల వర్షానికి మొత్తం నేలవాలింది. మరో కౌలు రైతు గోనెల శేషయ్య కౌలుకు తీసుకున్న పొలంలో మొక్కజొన్న పంట సైతం రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. మండల కేంద్రంలోని గొల్ల బుచ్చన్న నివాసముండే రేకుల షెడ్డు ఈదురుగాలులకు ఒక్కసారిగా కింద పడిపోయింది. గట్టుకాడిపల్లి గ్రామంలో చింత చెట్టు కూలి 5 విద్యుత్ స్తంభాలు కింద పడిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. షాపూర్‌లో విద్యుత్ లైన్ వైర్లు కింద పడిపోయాయి.

● కొత్తకోట మండలంలో అకాల వర్షాలకు పంటలు నేలకొరగడంతో రైతులు లబోదిబో మంటున్నారు. శనివారం రాత్రి ఈదరు గాలులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. చేతికొచ్చిన వరి పంటలతో పాటు మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి. కానాయపల్లి, సంకిరెడ్డిపల్లి, అమడబాకుల, రామకృష్ణాపూర్, అప్పరాల, పామాపురం, కొత్తకోట, పాలెం, కనిమెట్ట గ్రామాల్లో అప్పులు చేసి పంటలు వేసుకున్న రైతులకు అకాల వర్షం తీవ్ర నష్టం చేకూర్చింది. మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు.

● వనపర్తి రూరల్,(ఆంధ్రజ్యోతి): వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో బీభత్సం సృష్టించింది. అదే గ్రామానికి చెందిన దాదాపు 50 మంది రైతులు కుమ్మరి బాలయ్య, కృష్ణయ్య, తిరుపతయ్య, పార్వతమ్మ, కృష్ణయ్య, యాదగిరి, నారాయణ, రాములు, వడ్డె శ్రీను, వడ్డె రాములు, బోగం నరసింహ తదితర రైతులకు సంబంధించి దాదాపు 100 ఎకరాలకు పైగా వరి ధ్వంసం అయింది. అప్పులు చేసి వరి సాగు చేస్తే చేతికి వచ్చే సరికి నేలపాలు కావడం పట్ల రైతులు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారులుధ్వంసమైనవరిపంటను పరిశీలించారు.

● భూత్పూర్ మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వడగండ్ల వర్షం కురిసింది. ఈ వానతో మండలంలోని తాటిపర్తి, వెల్కిచర్ల, కర్వెన, కొత్తమొల్గర, పాతమొల్గర, భట్టుపల్లి తదితర గ్రామాల శివారుల్లో సాగు చేసి, పంట చేతికి వచ్చే సమయంలో వడగండ్ల వర్షం వరి, మామిడి, ఇతర కూరగాయల పంటలను పూర్తిగా నెల పాలు చేసింది. మండలంలోని వెల్కిచర్ల, తాటిపర్తి, కర్వెన గ్రామాల్లో వరి పంట ఎక్కువ శాతం పాడైపోయినట్లుగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెల్కిచర్లలో గాలి వానకు రోడ్ల మీద చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

మూసాపేట మండలంలో ఆదివారం క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయాధికారి అనీల్‌కుమార్, ఏఈవో సురేష్ రైతులతో కలిసి పరిశీలించారు. మొత్తం 420 ఎకరాల వరిపంట పాడైపోయిందని, ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. వేముల, చక్రపూర్‌లో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, అంజీరెడ్డి, కె.ప్రకాశ్‌రెడ్డి, గంటెల్లా రమేష్, గంగన్న యాదయ్యగౌడ్, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, ఉప్పరి మల్లయ్య, ప్రభాకర్‌సింగ్ తదితరులు తమకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. హన్వాడలో ఆరు ఎకరాల్లో రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసి వరి నాటానని రమణారెడ్డి తెలిపారు.


ఖిల్లాగణపురం మండలం గట్టుకాడిపల్లిలో నేలవాలిన చెట్టు


ఖిల్లాఘణపురంలో కూలిన గొల్ల బుచ్చన్న ఇంటి రేకుల షెడ్డు

ఆరెకరాల్లో పంట నష్టం

ఆరెకరాల్లో వరి పంట సాగు చేశా. రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టా. పంట చేతికందే దశలో వడగళ్ళ వాన కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పంట అమ్ముకుంటే రూ. 2.50 లక్షలు వచ్చేవి. ఇప్పుడు అకాల వానతో తీరని నష్టం వాటిల్లింది.

- గోపాల్ యాదవ్, రైతు బొక్కలోనిపల్లి


ధ్వంసమైన వరి పంటను పరిశీలిస్తున్న గ్రామస్థులు, వ్యవసాయ అధికారులు

అన్ని విధాలుగా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ మండలంలోని బొక్కలోనిపల్లి, రాంచంద్రపూర్, జామిస్తాపూర్ గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పంటలను పరిశీలించారు. రైతులకు జరిగిన నష్టపరిహారాన్ని 100శాతం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాలతో రైతులకు జరిగిన నష్టం గురించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితో వివరిస్తానన్నారు. రైతులకు పరిహారం వచ్చేవిధంగా చేస్తానని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారితో కలిసి పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మండలంలో బొక్కలోనిపల్లి, జమిస్తాపూర్, చౌదర్‌పల్లి, జానంపల్లి, తెలుగూడెం, రాంచద్రపూర్ గ్రామాల్లో మొత్తం 1520 ఎకరాల పంట నష్టం జరిగిందని తెలిపారు. వెంటనే పూర్తి స్థాయిలో నివేదికను ఇవ్వాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. ధర్మపూర్ మల్లు నర్సింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, గోవిందు యాదవ్, రాంపూర్ నర్సింహారెడ్డి, వెంకటేష్ యాదవ్, రైతులు రాంచంద్రయ్య, యాదయ్య, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతాంగం దిక్కు తోచని స్థితిలో ఉంది

● మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగం దిక్కు తోచని స్థితిలో ఉన్నదని, వడగండ్ల వర్షంతో రైతులు నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బొక్కలోనిపల్లి రాంచంద్రపూర్, జామిస్తాపూర్, తెలుగుగూడెం గ్రామాల్లో మండల బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామర్శించారు. కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నానని, వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతు జ్యోతి కంటతడిపెట్టుకుంది. ఆమెకు మాజీ మంత్రి ఆర్థిక సాయం అందించారు. రైతులు వ్యవసాయ అధికారులకు ఫోన్ చేస్తే సెలవులపై ఉన్నామని చెప్తున్నారని, ఎవరూ రాలేదని మాజీ మంత్రి దృష్టికి తీసుకురాగా వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి వెంటనే క్షేత్రస్థాయిగా పర్యటించి పంట నష్టంపై అంచనా వేయాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిండితిప్పలు లేకుండా వరి నాటు పెట్టుకున్న రైతులకు కోతదశలో ఉండగా వడగండ్లవాన కారణంగా వరిపంట దెబ్బతిన్నాయని, ప్రతి ఎకరానికి రూ.40 వేల చొప్పున సాయం అందించాలని, తక్షణ సహాయం కింద రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్, కేటీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని, ప్రభుత్వం ఆదుకోకుంటే న్యాయం జరిగేవరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు. రైతులకు రైతు భరోసా రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని అన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ఆంజనేయులు, దేవేందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాసులు, రాజగోపాల్ యాదవ్, అశోక్ గౌడ్, తిరుపతయ్య యాదవ్, చెన్నయ్య యాదవ్, తిరుపతయ్య, మారుతి గౌడ్, నాగులు, వెంకటయ్య పాల్గొన్నారు.


బొక్కలోనిపల్లిలోని రైతులతో కలిసి పంటలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి

క్రైం కార్నర్

అదుపుతప్పి లారీ బోల్తా
నలుగురికి గాయాలు


రోడ్డుపై బోల్తా పడిన లారీ

చారకొండ, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన చారకొండ మండలంలోని జూపల్లి సమీపాన జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకొంది. ఎస్‌ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు ఐరన్ లోడుతో వెళ్తున్న లారీ జూపల్లి సమీపంలో అదుపుతప్పి రోడ్డుకు రక్షణగా ఉన్న ఇనుప ర్యాంపును ఢీ కొట్టి అడ్డంగా పడింది. లారీ డ్రైవర్ శైలేష్ స్వామికి స్వల్ప గాయాలయ్యాయి. లారీలో ఉన్న ఐరన్ రాడ్లు చెల్లాచెదురుగా పడ్డాయి. లారీ ముందు వెళ్తున్న ఆటో వెనక భాగంలో ఇనుప ర్యాంపు ఎగిరి వచ్చి పడటంతో ధ్వంసం అయింది. అందులో ప్రయాణిస్తున్న అంజయ్యకు ఎడమ చేయి విరిగింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ రోడ్డుకు అడ్డంగా పడడంతో కల్వకుర్తి, దేవరకొండ వైపు కిలోమీటరు మేర వాహనాల రాకపోకలు నిలిచాయి. పోలీసులు, స్థానికులు రెండు గంటల పాటు శ్రమించి ఎక్స్‌కవేటర్ సహాయంతో లారీని పక్కకు తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చేశారు. ఆటో డ్రైవర్ లోకిలాల్ నాయక్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేఎల్‌ఐ కాలువలో యువకుడి మృతదేహం లభ్యం

బిజినేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారుకొండ గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ కాలువలో గుర్తు తెలియని 25 సంవత్సరాల యువకుడి మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం అటుగా వెళ్తున్న రైతులు కేఎల్‌ఐ కాలువలో తేలిన యువకుడి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే బిజినేపల్లి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కను తప్పించబోయి
బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

మదనాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి బైక్ మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన నంబిరాజు (32) భూత్పూర్‌లో ముత్తూట్ ఫైనాన్స్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ కొత్తకోటలో గల ముత్తూట్ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని మోటార్ సైకిల్‌పై శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా మండలంలోని దుప్పల్లి గ్రామ శివారలో అకస్మాత్తుగా కుక్క అడ్డురాగా దానిని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టారు. మోటార్ సైకిల్ నడుపుతున్న నంబి రాజు తలకు వెనుక భాగంలో బలమైన గాయమైంది. వెనకాల కూర్చున్న శ్రీకాంత్‌కు కూడా గాయాలయ్యాయి. వెంటనే వారిని వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కొరకు మహబూబ్‌నగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాజు మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తండ్రి మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్ గ్రామానికి చెందిన కావలి సాయికుమార్ (22) తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 17న సాయంత్రం తన పొలంలో ఉన్న గడ్డి మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి నారాయణపేట ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. తల్లి కావలి భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెపిల్లలు మృతి

వనపర్తి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మూడు గొర్రె పిల్లలు మృతి చెందాయి. అదే గ్రామానికి చెందిన గొల్ల జంపన్న తనకున్న మూడు గొర్రె పిల్లలను గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలోకి మేత కోసం తీసుకువెళ్లాడు. మేత మేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు 10 ఫీట్ల దూరంలో ఉన్న గొర్రె పిల్లలు కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు గ్రామస్థుల సహకారంతో విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. మృతి చెందిన గొర్రె పిల్లల విలువ సుమారు రూ.45వేలకు పైగా ఉంటుందని ప్రభుత్వపరంగా, రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

కాంగ్రెస్ పనైపోయింది

» వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

» సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయింది.. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చతికిల పడింది.. వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. బీజేపీ గెలుపును ఎవ్వరు ఆపలేరు" అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం ఎస్‌కే ఈవెంట్ హాల్‌లో జిల్లా నూతన అధ్యక్షుడితో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.... ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. అరకొర రుణమాఫీ చేసి అయిపోయిందంటోందని విమర్శించారు. పీఆర్‌సీలు లేవు.. ఉద్యోగులకు డీఏలు లేవు.. రైతు భరోసా లేదు అని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన పైసలతోనే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం అవుతున్నాయని వివరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేంద్రంపై నిందలు వేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అరాచకాలను వద్దనుకొని కాంగ్రెస్‌ను గెలిపించారని అన్నారు. నేను మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పటికీ ఎల్లప్పుడు గద్వాల ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నానని వివరించారు. జిల్లా నూతన అధ్యక్షుడు, కౌన్సిల్ సభ్యులతో పాటు నాయకులు బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకోసం పనిచేయాలని సూచించారు. గత ఎంపీ ఎన్నికలలో గద్వాలలో 20వేల మెజార్టీ ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో కూడా గద్వాలలో బీజేపీ జెండా ఎగురుతుందని వివవరించారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధికి పాటుపడుతున్న డీకే అరుణ ఉండటం ఇక్కడి ప్రజల అదృష్టం అని వివరించారు. గద్వాలకే కాదు.. ఢిల్లీ స్థాయిలో పేరున్న నాయకురాలు అని కొనియాడారు. అరుణ సారథ్యంలో బీజేపీ గెలుపు సాధ్యమేనని వివరించారు. జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, రవికుమార్ ఎగ్బోటే, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అక్కల రమాదేవి, బండల వెంకట్రాములు, జయలక్ష్మీ, పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు పోతుల భరత్, శివారెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసలు ఏం జరిగింది..?


» రాజాపూర్ కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ

» విద్యార్థిని, తల్లిదండ్రులను ఆరా తీసిన అధికారులు


రాజాపూర్ కేజీబీవీలో విద్యార్థినీ, తల్లిదండ్రులతో విచారణ చేస్తున్న అధికారుల బృందం

రాజాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై అధికారుల బృందం ఆదివారం విచారణ చేపట్టారు. రాజాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో సీనియర్‌లు కొట్టారని, టీచర్ తిట్టిందన్న కారణంతో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థిని వైష్ణవి శుక్రవారం సాయంత్రం ట్యాబ్లెట్స్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం పాఠకులకు విదితమే. సదరు విద్యార్థిని చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించగా, కోలుకున్న వైష్ణవిని ఆదివారం ఆసుపత్రి వైద్యులు డిశ్చార్జి చేశారు. అనంతరం కేజీబీవీకి సదరు విద్యార్థినిని ఎంఈవో సుధాకర్ తీసుకెళ్లారు. కాగా, కేజీబీవీలో జరిగిన సంఘటనపై పూర్తి విచారణ చేపట్టి నివేదిక అందించాలంటూ డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీసీడీవో రాధ, రాజాపూర్, జడ్చర్ల మండల తహసీల్దార్‌లు విద్యాసాగర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సీఎంవో బాలుయాదవ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, రాజాపూర్ ఎంఈవో సుధాకర్‌తో పాటు రాజాపూర్ జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు తిరుపతమ్మలు ఆదివారం కేజీబీవీలో విచారణ చేపట్టారు. కేజీబీవీలో చదువుకుంటున్న 30 మంది విద్యార్థినులతో 11 ప్రశ్నలతో కూడిన పత్రాన్ని అందించి, వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన వివరాలపై ఆరా తీశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందనే అంశాన్ని బాధిత విద్యార్థిని వైష్ణవి, అలాగే ఆమె తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఇదే సందర్భంలో కొందరు విద్యార్థినులు కేజీబీవీలోని టీచర్‌లు వ్యవహరిస్తున్న తీరును, విద్యార్థినుల పట్ల అవలంబిస్తున్న వ్యవహార శైలిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణను అధికారుల బృందం చేపట్టారు. కాగా, విచారణ నివేదికను ఉన్నత అధికారులకు సమర్పించనున్నట్లు స్థానిక విలేకరులకు వారు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థినిని రెండు రోజుల పాటు ఇంటికి తీసుకెళ్తారా అంటూ అధికారులు ప్రశ్నించగా హైదరాబాద్‌కు తీసుకెళ్తామంటూ తల్లిదండ్రులు జవాబిచ్చారు. జీవనం కోసం స్వంత తండా అయిన భూత్పూర్ మండలం అమృతండాను వదిలి హైదరాబాద్‌కు వెళ్లామని ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. వచ్చే విద్యా సంవత్సరంలో తల్లిదండ్రుల సమక్షంలో ఉంటూ విద్యాభ్యాసం చేసేలా చర్యలు తీసుకుంటామంటూ ఈ సందర్భంగా అధికారులు సూచించగా, ఆలోచించి అభిప్రాయం వెల్లడిస్తామని వైష్ణవి తల్లిదండ్రులు అధికారులకు తెలిపారు.

ఆయుర్వేద మట్టి స్నానం


ఆయుర్వేద మట్టి స్నానంలో పాల్గొన్న ఎస్‌ఐ, గ్రామస్థులు

రేవల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగాపూర్ గ్రామంలో ఆదివారం నాగపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ డొడ్డి శ్రీశైలం ఆధ్వర్యంలో ఆయుర్వేద మట్టి స్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు, రేవల్లి మండల ఎస్‌ఐ రాము పాల్గొన్నట్లు యోగా థెరపిస్ట్ శ్రీనునాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 150 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరితో పాటు శ్రీశైలం, మాజీ సర్పంచు పవులు, ప్రజాప్రతినిధులు, యువకులు, యోగా శిక్షకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


ఎంపికైన జిల్లా క్రీడాకారులతో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న హ్యాండ్‌బాల్ బాలికల జూనియర్ నేషనల్ టోర్నీ పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టులో బి. పారిజాత, శ్రీనిధి, మధురి చోటు దక్కింది. ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి టోర్నీ జిల్లా క్రీడాకారులు రాణించాలని ఆకాక్షించారు. రాష్ట్ర జట్టులో ముగ్గురికి చోటు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ సభ్యులు రజనికాంత్‌రెడ్డి, జీయావు ద్దీన్, బాల్‌రాజ్, అహ్మద్ హుస్సేన్, ప్రదీప్‌కుమార్, పీఈటీ ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.

లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం అందుకున్న కనకప్ప


కాంస్య పతకం అందుకున్న కనకప్ప

నారాయణపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని దామరగిద్దకు చెందిన కనకప్ప టి.44 క్యాటగిరి లాంగ్‌జంప్‌లో పారా అథ్లెటిక్స్ ఖేల్ ఇండియాలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి కాంస్య పతకాన్ని కనకప్ప అందుకున్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఢిల్లీలో జరిగిన ఖేల్ ఇండియా నేషనల్ గేమ్స్‌లో జిల్లా వాసి కనకప్ప టి.44 క్యాటగిరి లాంగ్‌జంప్ 5.30 సెంటీమీటర్స్ దూకి కాంస్య పతకం అందుకున్నారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ క్రీడాకారుడు కనకప్పను అభినందించారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

» జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్షుడు నటరాజ్


క్రీడాకారులతో జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్, వడెన్న

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్షుడు లయన్ నటరాజ్ అన్నారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సీనియర్ టెన్నికాయిట్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టులో యాసిన్, సుజాత్, మహిళల జట్టులో మమత, జాహ్నవి, శ్రీనిధిలకు చోటు లభించింది. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నటరాజ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. జాతీయ స్థాయి టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సెక్రటరీ వడెన్న, ఉపాధ్యాయుడు అశ్విని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సిల్వర్ మెడల్ అందుకున్న జిల్లా క్రీడాకారులు


అథ్లెటిక్స్ వరంగల్ కోచ్ శ్రీమన్నారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న క్రీడాకారులు

నారాయణపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్ గేమ్స్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో నారాయణపేట జిల్లాకు చెందిన క్రీడాకారులు విఘ్నేష్, రాజేశ్వరి, సోనిలు సిల్వర్ మెడల్స్ సాధించారు. అండర్-14లో సోనీ జావిలిన్‌త్రో, రాజేశ్వరీ 400 మీటర్ల పరుగుపందెంలో, అండర్ -18లో విఘ్నేష్ 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో సిల్వర్ మెడల్స్‌ను గెలుచుకున్నారు. అథ్లెటిక్స్ వరంగల్ కోచ్ శ్రీమన్నారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నా రు. దాంతో సిల్వర్ మెడల్ అందుకున్న జిల్లా క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ కార్య దర్శి రమణ అభినందించారు. సోని, విఘ్నేష్‌లది నారాయణపేట మండలం కోట కొండ గ్రామం కాగా, రాజేశ్వరీది మక్తల్ గ్రామం అని రమణ తెలిపారు.

ఇంటర్వ్యూ..

అధికారుల సూచనలతో అధిక దిగుబడులు

- శిరీష, వ్యవసాయ అధికారి, పెద్దకొత్తపల్లి



పెద్దకొత్తపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని పంట సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దకొత్తపల్లి మండల వ్యవసాయ అధికారి శిరీష అన్నారు. సాగు విధానంపై ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు పేర్కొన్నారు.

ప్రస్తుత రబీలో రైతులు ఏఏ పంటలను సాగు చేశారు?

మండలంలో వరి 8,144 ఎకరాల 10 గుంటల మొక్కజొన్న, 2,511 ఎకరాల్లో వేరుశనగ, 5,965 ఎకరాల్లో మినుములు, 4,998 ఎకరాల్లో జొన్న, 66ఎకరాల్లో కూరగా యల సాగు 150 ఎకరాల్లో సాగు చేశారు.

సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

రసాయన ఎరువులకు బదులు పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడకంతో అధిక దిగబడులు సాధించవచ్చు. సేంద్రియ ఎరువులు తయార చేసే విధానం, వాటిని ఏ విధంగా పంటలకు వేయాలనే విధానంపై పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పచ్చిరొట్ట, వేపనూనె వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

మండలంలో భూసార పరీక్షలు ఎలా నిర్వహిస్తారు?

భూసార పరీక్షలు చేయించుకోవాలంటే రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులకు ఇస్తే జడ్చర్లలోని మట్టి నమూనా కేంద్రాన్ని పంపిస్తాం. భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు రిపోర్టు ఇస్తాం.

ఎరువుల దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలపై మీ సమాధానం?

మండలంలోని వివిధ గ్రామాల్లో ఎరువుల దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని. నిబంధనలు పాటించని దుకాణదారులపై ఎఫ్‌సీవో 1985 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

న్యూస్ బాక్స్

పాల బిల్లులు చెల్లించాలి

ఉప్పునుంతల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని విజయ డెయిరీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇందూర్తి బుచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాడి రైతులకు గతేడాది సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన పాల బిల్లులతో పాటు 2025 సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబందించిన పాల బిల్లులు కేవలం కొరటికల్ గ్రామ విజయ డెయిరీకే రూ.5 లక్షలు రావాల్సి ఉందని ఆయన అన్నారు. గత ఏడు నెలల నుంచి పాల బిల్లులు రాకపోతే పాడి రైతులు కుటుంబ పోషణతో పాటు పాడి గేదెల పోషణ భారమై రైతులు పడ్డరాని పాట్లు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డెయిరీ జిల్లా అధికారులు స్పందించి రైతులకు పాలు బిల్లులు చెల్లించాలని కోరారు.

సుభాష్ యూత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి23 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం సుభాష్ యూత్, ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సేవా భారతి జిల్లా అధ్యక్షుడు ఆకుతోట సాయిబాబు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మంద పుల్లారెడ్డి, డాక్టర్ రోహిత్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘ్‌చాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్, విభాగ్ కార్యవాహ పత్తికొండ రాములు పాల్గొన్నారు.

విశ్వకర్మ పంచాంగం ఆవిష్కరణ

తెలకపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శ్రీత్రిముఖ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో భాగ్యనగర వాస్తువ్యులు బ్రహ్మశ్రీ రాళ్లబండి లంకేశ్వర సిద్ధాంతి గణించిన రాబోవు విశ్వావసునామ సంవత్సరం సూర్య సిద్ధాంత విశ్వకర్మ పంచాంగాన్ని పూజ చేసి పురోహితుల సమక్షంలో ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ మారోజు ఉమాపతి ఆచార్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఆ ప్రతులను పురోహితులకు అందజేశారు. అనంతరం వచ్చే నూతన విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు బ్రహ్మశ్రీ పోలోజు రామాచార్యులు, తుమ్మోజు శ్రీనివాసాచార్యులు, చింతోజు శ్రీనివాసాచార్యులు, గన్నోజు రాఘవేంద్రచార్యులు, తుమ్మోజు యాదయ్య చార్యులు, వెంకటాచార్యులు పాల్గొన్నారు.

'సీఎం సహాయ నిధి పేదలకు వరం'

పెద్దకొత్తపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు అన్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురికి ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, తాజా మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బాధితులైన భూసోద్ బాలయ్య రూ.60వేలు, శ్రీదేవి నిరంజన్ రూ.40వేల చెక్కుల పంపిణీ చేశారు.కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి తాజా మాజీ వార్డు సభ్యులు గడ్డిగోపుల ఎల్లయ్య, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శశికళ, శివ శంకర్, కూర రాముడు, సింగిల్ విండో డైరెక్టర్ సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, సాయిలు, రాముడు, భరత్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ...

- ప్రహరీ లేని ప్రభుత్వ పాఠశాల
- పాఠశాల భవనంలో పడకేస్తున్న పశువులు
- విద్యార్థుల చదువుకు ఆటంకం



వేడుకరావుపల్లితండాలో ప్రహరీ లేని ప్రభుత్వ పాఠశాల భవనం

పెద్దకొత్తపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మారేడుమానుదిన్నె గ్రామ పంచాయతీ పరిధిలోని వేడుకరావుపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలకు ఎన్నో ఏళ్ల నుంచి ప్రహరీ లేదు. దీంతో పాఠశాల భవనంలో పశువులు, మేకలు, కుక్కలు పడకేస్తున్నాయని తండావాసులు వాపోతున్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతున్నది. ఈ విషయాన్ని తండావాసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రహరీ నిర్మాణం చేపట్టలేదు. ప్రహరీ లేనందున విద్యార్థులకు విద్యాబోధన జరుగుతున్న సమయంలో విషసర్పాలు, కుక్కలు, పశువులు, గేదెలు సైతం పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థుల ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉందని వారి తల్లిదండ్రులు భయాందో ళనకు గురవుతున్నారు. అలాగే రాత్రి సమ యంలో కూడా కొంతమంది వ్యక్తులు పాఠశాల వరండాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తండావాసులు అంటున్నారు. గ్రామపెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వేడుకరావుపల్లి తండావా సులు కోరుతున్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



మారుమూలన అటవీ సరిహద్దులో ఉన్న వేడుకరావుపల్లి తండాలో గిరిజన చిన్నారులకు అక్షరభ్యాసం నేర్పించేందుకు ప్రభుత్వం మా తండాలో మండల ప్రాథమిక పాఠశాలను దశాబ్దన్నర క్రితం నిర్మించింది. కానీ, పాఠశాలకు ప్రహరీ లేనందున పశువులు, మేకలు, గొర్రెలు సైతం పాఠశాల వరం డాలోకి వచ్చి విద్యార్థుల చదువులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి మా తండాలో పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి.

- జగదీశ్, తండా యువకుడు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు
- జిల్లా కేంద్రంలో ఘనంగా వర్ధంతి



జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్/ కల్వకుర్తి/ కొల్లాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భగత్‌సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భగత్‌సింగ్ కలలుగన్న దానికి విరుద్ధంగా పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ దేశ వ్యాప్తంగా పరిశ్రమలు మూత పడగొట్టి ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేకుండా కాలయాపన చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు యువత సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆర్.శ్రీనివాస్, కెగీత, రామయ్య, యాదయ్య, డీవైఎఫ్ఐ నాయకులు మధు, వెంకటేష్, రవి, కుర్మయ్య, వెంకటయ్య, ఖాజా, రామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

● కల్వకుర్తి : భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ చిన్ననాటి నుంచే ఆంగ్లేయుల పరిపాలనపై వారి దోపిడీపై పోరాటం చేశారని పేర్కొన్నారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తన సహచరులైన రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లతో పాటు దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కంభం ఎక్కిన పోరాట యోధుడని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు, సీపీఎం నాయకులు కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎముక జంగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసులు, నాయకులు రామార్జున్.బాలయ్య, రాజు, నరేష్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షు డు అంతటి కాశన్న, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, కోశాధికారి అశోక్, డీవైఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు, నాయకులు మల్లికార్జున్, చంద్రశేఖర్, రమేష్, బాలు, గోపాల్, అంజి, మల్లేష్ పాల్గొన్నారు.

● కొల్లాపూర్ : షహీద్ భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు రాబోయే రోజుల్లో అవినీతిపై ప్రశ్నించే తత్వం పెంచుకోవాలని బీఆర్‌ఎస్‌వి విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు శేఖర్ పిలుపునిచ్చారు. విప్లవ యువ కిశోరాలు భగత్‌సింగ్ రాజ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వి విద్యార్థి సంఘం మండల నాయకులు జయరాం, సాంబశివ విద్యార్థులు సందీప్, వంశీ, చరణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో భగత్‌సింగ్ చిత్ర పటానికి ఘన నివాళి...



కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ...

కనకాల మైసమ్మ తల్లికి పూజలు

బల్మూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గుండె ఆపరేషన్ చేయించుకున్న నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండ కమిటీ ఆధ్వర్యంలో జినకుంట కనకాల మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపంగి రమేష్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు శివగౌడ్, మాజీ సర్పంచ్ ఎల్లికంటి శ్రీనివాసులు, జినకుంట అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కృష్ణయ్య, లింగమయ్య, గరోటి మస్తాన్, గోరటి శివుడు, గోరంట్ల నరసింహ, పరశురాములు, రవీందర్, పురుషోత్తం, వెంకటస్వామి, బాలచంద్రి, శేఖర్, రాకేష్ పాల్గొన్నారు.

'బీసీల పక్షపాతి కాంగ్రెస్'

పదర, మార్చి 23 (ఆంధ్రజ్యో తి) : దేశంలోని బీసీలకు సరైన వాటా దక్కాలని కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తూ బీసీల పక్షపాతిగా ఉందని డీసీసీ ప్రధాన కార్యదర్శి రాసనూరి మహేష్ అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని చిట్లంకుంట గ్రామంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ బిల్లు పెట్టడం ఎంతో హర్షించదగ్గ విషయమని తెలిపారు. యావత్తు బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరికృష్ణ, అనిల్, రాజు, రేణు, మొత్య, స్వామి పాల్గొన్నారు.

చేపలను చంపిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పదర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉడిమిల్ల గ్రామ సమీపంలోని అడవిలో గల మానుపడ్డ వాగు తోకమడుగు నీటిలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రసాయనాలను కలపడంతో అందులోని చేపలన్నీ చనిపోయాయి. విషయం తెలుసుకున్న ఉడిమిల్ల గ్రామస్థులు అటవీ సమీపంలో ఉన్న జలాశయాల్లో జరుగుతున్న ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అటవీశాఖ అధికారులు చూడాలని వారే బాధ్యత వహించాలని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అడవిలో ఉన్న వన్యప్రాణులు ఈ నీటిని తాగితే మృతి చెందుతాయని వెంటనే ఆ నీటిని కెమికల్ ట్రీట్‌మెంట్ చేసి శుద్ధి చేయాలని కోరుతున్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని మగ మనిషి సుమారు (55) మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. బక్కపల్చని శరీరంతో మాసిన తెలుపు రంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్టు వెనకాల చనిపోయి ఉన్నాడు. అతని వివరాలు తెలిసినట్లయితే నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఇసుక వాహనాలు సీజ్

కల్వకుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక లారీ, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం... వంగూరు మండలం డెండి చింతలపల్లి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, రెండు ట్రాక్టర్లను పట్టణ పరిధిలోని జేపీనగర్ వద్ద గుర్తించినట్లు తెలిపారు. వాటిని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను ఎవరూ తరలించిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

'మా భూమి' రథయాత్రను విజయవంతం చేయాలి : డీఎస్పీ

చారకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యస్థాపనకై చేపట్టిన లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చారకొండ చంద్రశేఖర్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన లక్ష కిలో మీటర్ల మాభూమి రథయాత్ర వాల్ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశారదన్ మహరాజ్ ఏప్రిల్ 14న ఆదిలాబాద్ నుంచి లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్రను ప్రారంభిస్తున్నారని రథయాత్రను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లేష్, ఆపార్టీ నాయకులు మల్లేష్, మొగులయ్య, మహేష్, వెంకటయ్య, శివ, విజయ్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ నిజాముద్దీన్ ఒక ప్రకటనలో కోరారు. రాజీవ్ యువ వికాసం పేరుతో ఈ పథకాన్ని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించారని అర్హులైన యువతీ యువకులకు లక్ష నుంచి నాలుగు లక్షల వరకు రుణ సహాయం అందుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఏప్రిల్ 5వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

108 వాహనం తనిఖీ

తెలకపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ హెడ్ ఆఫీస్ అధికారి పకీర్ దాస్ ఆదివారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వాహనంలో పని చేస్తున్న మెడిసిన్ పనిముట్లు పనితీరును ఆయన పరిశీలించారు. వాహనంలో పని చేస్తున్న సిబ్బందికి సర్వీస్‌కు సంబంధించిన విషయాలను వివరించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, 108సిబ్బంది ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ కురుమూర్తి తదితరులు ఉన్నారు.

కార్గో సర్వీసు ద్వారా తలంబ్రాలు

తెలకలపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్‌ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా సీతారామస్వామి తలంబ్రాలను ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ ఎస్.చంద్రశేఖర్, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఉమా పతి, తెలకపల్లి ప్రకండ కార్యదర్శి శివకృష్ణ, సీనియర్ నాయకులు పి.చంద్రమౌళి, ఎం.వెంకటరెడ్డి, టి.శ్రీనివాసచారి, కే.వెంకటాచారి, ఎం.చిన్నారెడ్డి, ఎం.చిన్న కుర్మయ్య, సాయిబాబు, చెన్నబాబు, పి.మల్లేష్, నరేందర్, కొత్త అనిల్ తదితరులు ఆదివారం బుక్ చేసుకున్నారు.

విద్య కాషాయీకరణను వ్యతిరేకించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్
- జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ



ఎస్ఎఫ్ఐ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగాన్ని కాషాయీకరణ చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో ఎస్ఎఫ్ఐ నాలుగవ జిల్లా మహాసభలు నిర్వహించారు. సభలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ హాజరై ప్రసంగించారు. విద్యారంగంలో జ్యోతిష్యం, మూఢ విశ్వాసాలను చొప్పించి పాఠ్యపుస్తకాలను మార్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దేశంలో విద్య, వైద్యం, ఉపాధి దినదినానికి సామాన్యులకు అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.సయ్యద్, తారాసింగ్, నాయకులు శివకుమార్, జమాలుద్దీన్, జస్వంత్, ప్రవీణ్, కార్తీక్, ప్రణయ్, చరణ్, రాజేశ్ పాల్గొన్నారు.

రెండున్నర దశాబ్దాల తర్వాత...

- పూర్వ విద్యార్థుల కలయిక - గురువులకు సన్మానం..



వెన్నచెర్ల హై స్కూల్‌లో 1997-98లో పదవ తరగతి విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెన్నచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98వ బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో అందరూ ఒక్కటై ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. తోటి స్నేహితులు కలిసిన శుభసందర్భంలో తమ బాల్య స్మృతులను పంచుకున్నారు. వారంతా తాము ఎదుర్కొన్న కష్టసుఖాలను పాల్పంచుకున్నారు. అలాగే ఉపాధ్యాయులు మాట్లాడుతూ చాలా చక్కటి అనుభవాలను, సందేహాలను విద్యార్థులకు పంచారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు కప్పి, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ గురువులు ఇంగ్లిష్ టీచర్ సుధాకర్, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు కృష్ణయ్య, తెలుగు పండిత్ బాలరాజు, గణిత బోధకుడు ప్రకాశ్‌శర్మ, తెలుగు బోధకుడు సత్యనారాయణరెడ్డి, స్నేహితురాలు స్నేహితులు కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు భార్గవి, రాధా, అమృత, సుజాత, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, రాజు, భాస్కర్‌రెడ్డి, సలేశ్వరం, కుర్మయ్య, వెంకటేశ్, లింగం పాల్గొన్నారు.

నిరంతర పోరాటమే సీపీఐ లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

కందనూలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల పక్షాన నిరంతరం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో ఎం.బాలనరసింహ సమక్షంలో తాడూరు గ్రామానికి చెందిన వ్యక్తులు గొర్ల సత్యం, కొత్తల్ల బుచ్చయ్య, గొర్ల రామచంద్రయ్య, గడ్డం రాములు, అలియాస్ జంపయ్యలు ఆదివారం సీపీఐలో చేరారు. వారికి సీపీఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆనాటి నుండి నేటి వరకు నిరంతరం పోరాడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, పెద్దకుర్మయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీపతి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పి.కృష్ణాజీ, బాబు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



కొల్లాపూర్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొల్లాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి కొల్లాపూర్ పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఎం ఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జిల్లా నాయకులు మంద నరసింహ మాదిగ, వడ్డెమాన్ రాములు మాదిగ, నాగులపల్లి లక్ష్మయ్య మాదిగ మాట్లా డుతూ... 30 సంవత్సరాల క్రితం ఎమ్మార్పీఎస్ స్థాపించి మాదిగల హక్కుల కోసం పోరాడుతూ ఏబీసీడీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ పోరాటం ఫలించిందని ప్రభుత్వాలు దిగివచ్చి అసెంబ్లీలో తీర్మానం చేసి వర్గీకరణ బిల్లును ఆమోదించడం మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే అన్నారు. అనంతరం బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీ వన్‌రామ్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దండోరా నాయకులు తిరుపా లు నాగరాజు, మధు, జగదీష్, రామకృష్ణ, పుట్ట పాక రాముడు, నాగరత్నం, అగ్రస్వామి, మహేష్ పాల్గొన్నారు.

సిర్సనగండ్ల దేవాలయ భూములపై

గిరిజనులకే హక్కులు కల్పించాలి

- ఎంపీ మల్లు రవికి గిరిజన సంఘం నాయకుడు సరిరాం నాయక్ విజ్ఞప్తి



ఎంపీ మల్లు రవిని కలిసిన గిరిజనులు

చారకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సిర్సన గండ్ల సీతారా మచంద్రస్వామి దేవాలయంలో అగ్రహారంతండా, గైరాన్‌తం డాకు చెందిన గిరిజనులు ఆదివారం ఎంపీ మల్లు రవిని కలిశారు. దేవా లయ భూములను ఎన్నో ఏళ్లుగా గిరి జనులం సాగు చేస్తున్నామని, వాటి పై తమకే పూర్తి హక్కులు కలిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీకి ఎంపీకి విన్నవించారు. గిరిజన సంఘం మండ ల నాయకుడు సరిరాం ఆధ్వర్యంలో గిరిజన రైతులు ఆదివారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని ఆయన నివాసంలో కలిశారు. దేవాలయ భూములను సాగు చేసుకొంటున్న గిరిజనులకే హక్కులు కల్పించాలని వినతి పత్రం అంజేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ మీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారని సరిరాం నాయక్ తెలిపారు. ఎంపీ మల్లు రవిని కలిసి న వారిలో గిరిజన సంఘం మండల నాయకులు సంతోష్ నాయక్, శ్రీను నాయక్, రామ్‌లాల్ నాయక్, రవినాయక్, శివనాయక్ ఉన్నారు.

ఎంపీ మల్లు రవికి వినతి

మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ దేవాలయ మాజీ ఛైర్మన్ దేరం మల్లికార్జునశర్మ ఆదివారం ఎంపీ మల్లు రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎంపీ ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని ఆయన అన్నారు. ఏప్రిల్‌లో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఎంపీ మల్లు రవికి మల్లికార్జున శర్మ ఆహ్వానం అందించారు.

మిత్రుడి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

బిజినేపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తమతో పాటు చదువుకున్న చిన్ననాటి మిత్రుడు అకాల మృతి చెందడంతో స్నేహితులు కలిసి పెద్దదిక్కు కోల్పోయిన ఆ కుటుంబానికి ఆదివారం రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాగర్ కర్నూల్ మండలం గుడిపల్లి గ్రామానికి చెందిన మృతుడు బాలకృష్ణ బిజినేపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరం పదవ తరగతి వరకు తమతో కలిసి చదువుకొని సన్నిహితంగా ఉన్న స్నేహితుడు అకాల మృతి చెందడంతో భార్యాపిల్లలు దిక్కులేని వారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో రమేష్‌గౌడ్, చిరంజీవి, ఎద్దుల వెంకటేష్, శివుడు, సురేష్, రాఘవేంద్ర, ఖదీర్, మహేష్, రాములు, వెంకటేష్, ఆశోక్, మైబూస్, శివేంద్ర ఉన్నారు.